

రామన్నకు పూజలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో కొనసాగుతున్న సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ స్థానాచార్యులు భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



పత్తి క్వింటాల్‌కు రూ.7,307

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో శుక్రవారం పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,307 పలికింది. కనిష్టంగా రూ.6,057, సగటు ధర రూ.7,007 నమోదైంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

ఉపవాసంతో మనిషిని బాధించడం ఇస్లాం ఉద్దేశం కాదు. పేదవాడి ఆకలి బాధలు తెలుసుకోవడమే ఇస్లాం ఉద్దేశం.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్ శని : 6:32 | సహర్ ఆది: 4:51

న్యూస్‌రీల్

క్షయపై అవగాహన పెంచుకోవాలి



ర్యాలీలో మున్సిపల్ చైర్‌పర్సన్, తదితరులు

పెద్దపల్లిరూరల్: క్షయ వ్యాధి లక్షణాలు కనిపిస్తే భయపడాల్సిన పనిలేదని, బాధితులు సమీపంలో ఉన్న సర్కార్ ఆస్పత్రులకు వెళ్తే పూర్తి ఉచితంగా వ్యాధిని నయం చేస్తారని మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మమతారెడ్డి అన్నారు. ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా పెద్దపల్లిలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. క్షయ లక్షణాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. వైద్యసిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎక్కువ టీబీ కేసులను నిర్ధారించిన ఢాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను సత్కరించారు. ఉత్తమ సేవలందించిన పలువురికి డీఎంహెచ్‌ఓ ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ శ్రీధర్, సుధాకర్‌రెడ్డి, మహేందర్, కావేటి రాజగోపాల్, లావణ్య, శ్రావణ్, శ్రీనివాసశ్రీరాం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా రాజశేఖర్



చైర్‌పర్సన్ సునీతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ రాజశేఖర్

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ సెక్రెటేరియట్‌లో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన నరసింహ ఇటీవల గద్వాల్‌కు బదిలీ అయ్యారు. కాగా మూడు నెలలపాటు ఇన్‌చార్జిగా పెద్దపల్లి కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజశేఖర్ మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలోని వ్యాపారులు విధిగా పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు. అనంతరం చైర్‌పర్సన్ ముత్యం సునీత రమేష్‌గౌడ్‌ను కమిషనర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఇంటర్ పరీక్షలకు 109 మంది గైర్హాజరు


పెద్దపల్లిరూరల్: జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 109 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 4,194 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 4,085 మంది హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారిణి కల్పన తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న మోదీ



రాస్తారోకో నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని(రామగుండం): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటువేయడం ప్రజాస్వామాన్ని అపహాస్యం చేయడమేనని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రాజీవ్‌రహదారిపై కాంగ్రెస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేయడానికి ఇంకా సమయం ఉండగానే పార్లమెంటు సభ్యుడిగా అనర్హత గెజిట్ విడుదల చేయడం మోదీ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్య పద్ధతిలో ఆలోచించి అనర్హత గేజిట్ వెనక్కి తీసుకోవాలని, కోర్టు ఆదేశాలు వచ్చేంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొంతల రాజేష్, ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, నాయకులు కాల్వ లింగస్వామి, పెద్దెల్లి తేజస్విని, ప్రకాష్, యుగేందర్, శ్రీనివాస్, నసీముద్దీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌లో మునిగిన పంట పొలాలు(ఫైల్)



సాగు చేయక.. సాయం అందక..

- ఐదేళ్లుగా పరిహారం కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆందోళన చెందుతున్న బాధిత రైతులు

కాళేశ్వరం బ్యాక్ వాటర్‌లోనే వందలాది ఎకరాలు

మంథని: కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో మంథని నియోజకవర్గంలోని వందలాది ఎకరాలు నీటమునుగుతున్నాయి. ముంపు భూముల సర్వే చేసిన అధికారులు ఐదేళ్లుగా పరిహారం చెల్లించకపోవడంతో సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వర్షం పడితే చాలు సాగునీటి ప్రాజెక్టుల్లోకి భారీగా వరద వచ్చి చేరి గోదావరి, మానేరు తీరం వెంట ఉన్న పంటపొలాలు నీటిపాలవుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని సరస్వతి (అన్నారం), పెద్దపల్లి జిల్లాలోని పార్వతి(సుందిళ్ల), మేడిగడ్డ బ్యారేజీల పరిధిలో సుమారు మూడు వేల ఎకరాల్లో వరద నీరు చేరుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన ఐదేళ్ల కాలంలో పది పంటలు నష్టపోయామని బాధిత రైతులు పేర్కొంటున్నారు. కేవలం రెండు పంటలకే క్రాప్ హాలీడే ప్రకటించి పరిహారం చెల్లించి తర్వాత మరిచారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ భూముల్లో సాగు చేయక.. ప్రభుత్వ సాయం అందక సతమతమవుతున్నారు. కాగా పరిహారం చెల్లించాలని కోరుతూ ఐదు రోజుల క్రితం సుమారు 200 మంది రైతులు మంథనికి తరలివచ్చారు. రోడ్డుపై ధర్నా చేపట్టి నిరసన తెలిపారు.

సర్వేకే పరిమితం..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం, జిల్లా పరిధిలోని సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీ పరిధిలో బ్యాక్ వాటర్ మూలంగా ఎంత మేరకు భూములు నీట మునుగుతున్నాయని, పంటలకు నష్టం ఎంత వాటిల్లుతుందని నీటిపారుదల శాఖ అధికారులు సర్వేలు నిర్వహించి అంచనా వేశారు. ఇందు కోసం ఆయా గ్రామాల్లో గ్రామ సభలు సైతం నిర్వహించారు. కొన్ని గ్రామల్లో అవార్డు పాస్ చేయగా మరికొన్ని గ్రామాలకు అవార్డు పాస్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేసి సిద్ధంగా ఉంచారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయితే అవార్డు పాస్ చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. కాగా ఎకరాకు రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రాజెక్టుకు భూములిచ్చి పరేషాన్

రాష్ట్ర ప్రజలకు సాగు, తాగు నీటి అవసరాలకు ఉపయోగపడే కాళేశ్వరం ప్రాజెక్టుకు భూములిచ్చిన తాము ఐదేళ్లుగా పంటలను నష్టపోవాల్సి వస్తుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం విషయంలో పలుమార్లు హామీలిచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు కొంతకాలంగా ముఖం చాటేశారని పేర్కొంటున్నారు. మంథని నియోజకవర్గ పరిధిలో దాదాపు 20కిపైగా గ్రామాల్లో 3వేల ఎకరాల వరకు సాగు భూములు నీటమునుగుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ తమ బాధలను అర్థం చేసుకొని న్యాయం చేస్తారన్న ఆశలను అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు.

కూలీకి పిలిచేటోళ్లు కరువయిండ్రు



బ్యాక్ వాటర్‌లో నాది ఎకరంన్నర భూమి ఉంది. నాతో పాటు ఊళ్లో 370 పైగా ఎకరాలు నీళ్లలో మునుగుతున్నయ్. ముగ్గురు కొడుకులున్నా నాకు కుటుంబం భారమైతాంది. కూలీకన్నా పోదామంటే పనులు లేక కూలీకి పిలిచేటోళ్లు కరువయింద్రు.
– ఊయల లక్ష్మి, ఆరెంద, మంథని

ప్రభుత్వం ఆదుకోవాలి



ఐదు సంవత్సరాలుగా భూమి ముంపునకు గురవుతుంది. పిల్లల చదువుకు కష్టమవుతాంది. భూమే మాకు ఆధారం. సాగు లేక ఇబ్బంది అవుతుంది. ప్రభుత్వం భూమికి బదులు మరోచోట భూమి ఇవ్వాలి లేదా ఎకరాకు రూ.20 లక్షలు ఇచ్చి ఆదుకోవాలి. – రమ, మల్లారం, మంథని



వార్షికోత్సవ సంబరం

సాక్షి దినపత్రిక 15వ వార్షికోత్సవ సంబరాలు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని యూనిట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్, బ్యూరో ఇన్‌చార్జి అనిల్, కరీంనగర్, ఆదిలాబాద్ ఎడిషన్ ఇన్‌చార్జీలు బి.శ్రీనివాస్, జి.మహేశ్, పెద్దపల్లి స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లాలోని ఆర్సీ ఇన్‌చార్జీలు, ఏడీవీటీ మేనేజర్ లక్ష్మినారాయణ, ఐటీ మేనేజర్ వేణు, ఏసీఎం మధుకర్, ప్రొడక్షన్ ఇన్‌చార్జి ప్రకాశ్, స్టోర్ ఇన్‌చార్జి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా రాష్ట్ర సంక్షేమ పథకాలు

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక దుర్గానగర్‌లోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం పకడ్బందీ ప్రణాళికలను రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిలో నివాసం ఏర్పర్చుకున్న నిరుపేదలకు 100 గజాల లోపు స్థలానికి ఉచితంగా పట్టాలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే చందర్ కృషితో రామగుండంలోని పేద ప్రజానీకానికి న్యాయం జరుగుతుందన్నారు. పట్టాలు రానివారిని గుర్తించి సాధ్యమైనంత త్వరలోనే అందజేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కోరుకంటి మాట్లాడుతూ, సింగరేణి కార్మికులు దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న, సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వాటికి జీవో 76 ప్రకారం పట్టాలు మంజూరు చేయించామని, ఈసందర్భంగా 326మందికి పట్టాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్, నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, తహసీల్దార్ జాహెద్ పాషా, నాయకులు బాల రాజ్‌కుమార్, రాకేశ్, పాతపల్లి ఎల్లయ్య, అడప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ స్టోర్ ఎక్స్‌టెన్షన్ బ్లాక్ ప్రారంభం



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న జీఎం నారాయణ

గోదావరిఖని(రామగుండం): మెడికల్ స్టోర్ ఎక్స్‌టెన్షన్ బ్లాక్ శిలాఫలకాన్ని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ శుక్రవారం ప్రారంభించారు. సింగరేణి ఏరియా ఆసుపత్రిలో రూ.47లక్షలతో నూతనంగా నిర్మించిన భవనంతో పాటు డిజిటల్ రేడియోగ్రఫీ శిలాఫలకాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అదనపు హాల్ నిర్మించామన్నారు. ఆధునిక సాంకేతికత వ్యవస్థతో కూడిన డిజిటల్ రేడియోగ్రఫీ సిస్టంను కూడా ప్రారభించామని వివరించారు. కార్యక్రమంలో డీవైసీ ఎంఓ డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంఓఏఐ అధ్యక్షుడు శ్రీనివాస్, డాక్టర్ అంబికా, ఫిట్ సెక్రటరీ రత్నమాల, నాయకులు యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్, అధికారులు

- వీడియో కాన్ఫరెన్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

పెద్దపల్లిరూరల్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో టెన్త్ పరీక్షలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, పోడు భూములు, హరిత హారం, అగ్నిప్రమాదాల నియంత్రణ చర్యలు, కంటివెలుగు, మహిళా ఆరోగ్యకేంద్రాలు, భూముల క్రమబద్ధీకరణ, వైకుంఠధామాలు తదితర అంశాలపై సూచనలిచ్చారు. ఏప్రిల్ 3నుంచి మొదలయ్యే పదో తరగతి పరీక్షలు సాఫీగా జరిగేలా చూడాలన్నారు. ఎండాకాలంలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

లబ్ధిదారుల ఎంపిక పూర్తి: కలెక్టర్ సంగీత

జిల్లాలో డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా పూర్తి చేశామని కలెక్టర్ సంగీత అన్నారు. లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 22 వైకుంఠధామాల్లో మౌలిక వసతుల కల్పన పనులు త్వరితంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టెన్త్ పరీక్షల కోసం జిల్లాలో 47 కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. డీఎఫ్‌ఓ శివయ్య, డీఆర్‌డీఓ శ్రీధర్, డీఈఓ మాధవి, డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్, ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, సుమన్‌రావు, శారద, ఇంటర్ నోడల్ అధికారి కల్పన, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న మహిళా నాయకులు

పెద్దపల్లిరూరల్: పశుమిత్రలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయూ నాయకురాలు, పశుమిత్ర వర్కర్స్ జిల్లా గౌరవాధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. పశుసంతతి వృద్ధికి పనిచేస్తున్న పశుమిత్రలకు పనికితగ్గ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కృత్రిమ గర్భధారణ శిక్షణ ఇప్పించి గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. విధులకు వెళ్లేందుకు వీలుగా ఈ–బైకులను రాయితీపై అందించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు దశలవారీగా పోరాటాలు సాగిస్తామని పేర్కొన్నారు. నాయకులు రాజేశ్వరి, ప్రియాంక, సరిత, అనూష, సుధ, ఉమాదేవి, స్వప్న, సంధ్య, శ్రీలత, సంతోష పాల్గొన్నారు.

అవగాహనతోనే టీబీ నియంత్రణ



ర్యాలీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ(రామగుండం): క్షయ వ్యాధిపై అవగాహనతోనే రోగి ప్రాణాలను కాపాడటంతోపాటు వ్యాప్తిని నియంత్రింగలమని రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్) టీబీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిమబిందు సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృపాబాయి మాట్లాడారు. టీబీ నివారణను సమాజంలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా భావించాలని కోరారు. టీబీ బ్యాక్టీరియా సాధారణంగా దగ్గు, తుమ్ముల సమయంలో ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని వెల్లడించారు. టీబీ ప్రాణాంతకమైన వ్యాధి అయినా సకాలంలో చికిత్స తీసుకుంటే తిరిగి ఆరోగ్యవంతులుగా కోలుకుంటారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాట్స్ మందులు అందుబాటులో ఉన్నాయని, రెండు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే టీబీ నిర్ధారణ కోసం తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయితే ఆరు నెలలు డాట్స్ మందులు వాడడంతోపాటు పోషకాహారం తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయమవుతుందని, ప్రభుత్వం కూడా నెలకు రూ.500 నగదు కూడా పేషెంట్ల అకౌంట్‌లో జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఆస్పత్రిలోని టీబీ, ఏఆర్‌టీ తదితర విభాగాల సిబ్బంది తోట గోపీకృష్ణ, పాపయ్య, నీడ రమేష్, మల్లారెడ్డి, సంపత్, లిటిల్ తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో ‘గుర్తింపు’ ప్రక్రియ..!?

- యాజమాన్యానికి అనుకూలంగా ఉత్తర్వులు
- విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి
- జూలైలో ఎన్నికలు జరిగే అవకాశం

గోదావరిఖని(రామగుండం): సింగరేణి గుర్తింపు ఎన్నికలు ఆలస్యం కానున్నాయి. విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో జూన్‌లో ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని సింగరేణి వాదనకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో రెండు నెలలు ఆలస్యంగా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరగనున్నాయి. గుర్తింపు ఎన్నికలు సాధ్యమైనంత త్వరగా నిర్వహించాలని కోరుతూ ఏఐటీయూసీ యూనియన్ డిసెంబర్‌లో హైకోర్టును ఆశ్రయించింది. రెండు నెలల్లోగా గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ హైకోర్టు కార్మికశాఖ, సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసింది. మార్చి చివరితో ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతుందని అందరూ భావించారు. అయితే ఏప్రిల్, మే నెలల్లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తే సింగరేణి యాజమాన్యం ఉత్పత్తిని నష్టపోయే అవకాశం ఉంది. దీంతో సంస్థ వాస్తవ పరిస్థితిని వివరిస్తూ హైకోర్టును ఆశ్రయించింది.

యాజమాన్యం వాదనతో..

వేసవిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండటంతో బొగ్గుకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, ఈక్రమంలో ఎన్నికలు నిర్వహిస్తే బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని పేర్కొంది. ఏప్రిల్, మే నెలల్లో గుర్తింపు ఎన్నికలు నిర్వహిస్తే బొగ్గు ఉత్పత్తి కీలకంగా ఉన్న సమయంలో ఓసీపీల్లో ఉత్పత్తి తగ్గిపోతుందని, విద్యుత్ డిమాండ్ మేరకు బొగ్గును అందించే పరిస్థితి ఉండబోదని తెలిపింది. ఈక్రమంలో యాజమాన్యం వాదనతో హైకోర్టు ఏకీభవించింది. యాజమాన్యానికి సానుకూలంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఉత్పత్తికి కీలక సమయం కావడంతో ఏప్రిల్, మే నెలలు మినహాయించి ఎన్నికల పక్రియ జూన్ నుండి ప్రారంభించేలా చూడాలని కోరింది. హైకోర్టు తీర్పుకాపీ బయటకు రానప్పటికి జూన్ నెలలోనే ఎన్నికలు పక్రియ ప్రారంభమవుతుందని, సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాలు నిర్ధారణకు వచ్చాయి.

ఎన్నికలు నిర్వహిస్తే ఉత్పత్తికి విఘాతం

వేసవిలో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. సింగరేణిలోనే ఓసీపీలు ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తాయి. ఈక్రమంలో రాబోయే రెండు నెలలు కీలకంగా మారనున్నాయి. ఎన్నికల నిర్వహించడం మూలంగా షిఫ్టునకు రెండుగంటల పాటు బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. దీంతో ఉత్పత్తి గణనీయంగా పడిపోయి డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు అందించడం కష్టసాధ్యంగా మారనుంది. అయితే వర్షాకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోతుందని, అంతేకాకుండా వర్షాకాలంలో విద్యుత్ వినియోగం కూడా తక్కువగా ఉంటుందని యాజమాన్యం పేర్కొంది. ఈమేరకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఎన్నికల ప్రక్రియ జూన్‌లోనే చేపట్టనున్నారు.



ప్రచారానికి సంఘాల కసరత్తు

జూన్‌లో ఎన్నికల పక్రియ ప్రారంభం అయ్యే క్రమంలో సింగరేణిలోని కార్మిక సంఘాలు తమ ప్రచారానికి కసరత్తు ప్రారంభించాయి. కార్మికులను మచ్చిక చేసుకునేందుకు ఇప్పటికే గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నాయి. అయితే జూన్‌లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తే కార్మిక సంఘాలకు అనుబంధంగా ఉన్న రాజకీయ పార్టీలు కూడా రంగంలోకి దిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

క్లుప్తంగా

ఆదివరాహస్వామి హుండీ లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న వలంటీర్లు

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి ఆలయ హుండీ లెక్కింపును శుక్రవారం చేపట్టారు. కొద్దిరోజుల నుంచి స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించగా రూ.8,46,307 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కాంతరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇనగంటి ప్రేమలత, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

మంథని: ద్విచక్రవాహనానికి ఎదురుగా కుక్కలు అడ్డురావడంతో కిందపడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలీలు ద్విచక్రవాహనంపై శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి నుంచి గోదావరిఖని వెళ్తున్నారు. మండలంలోని గుంజపడుగు వద్దకు చేరుకోగానే వీధికుక్కలు అడ్డురావడంతో వారు అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో మహేష్ చౌదరి, సునీల్ దాంగ్రే గాయపడ్డారు. 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో ఈఎంటీ నిమ్మతి శ్రీనివాస్, పైలట్ మల్లేశ్ ప్రథమ చికిత్స అందించి మంథని సామాజిక వైద్యశాలకు తరలించారు.

విద్యార్థులను ప్రావీణ్య రంగాల్లో ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న భానుప్రసాద్‌రావు

సుల్తానాబాద్: విద్యార్థులను ప్రావీణ్యం ఉన్న రంగాల్లోనే ప్రోత్సహించడం వల్ల భవిష్యత్తులో ఉన్నత శిఖరాల్లో రాణిస్తారని శాసనమండలి చీఫ్ విప్ తానిపర్తి భానుప్రసాదరావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలో శుక్రవారం రాత్రి అల్ఫోర్స్ హైస్కూల్ 9వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌ను మంచికి ఉపయోగిస్తే భవిష్యత్తు ఉంటుందని, చెడుకు ఉపయోగిస్తే జీవితం అంధకారం అవుతుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, వైస్ చైర్మన్ బిరుదు సమత, రైస్ మిల్లర్స్ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్‌రెడ్డి, సాయిరీ మహేందర్, గుర్రాల శ్రీనివాస్, సురేఖ, ఎరుకొండ రమేష్‌గౌడ్, పరుశరాములుగౌడ్, పల్లా సురేష్, ముత్యం రమేష్, బిరుదు రాధాకృష్ణ, ఫకీర్‌యాదవ్, భూమేష్ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్ సంగీత సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ సంగీత సత్యనారాయణ

సుల్తానాబాద్ రూరల్ : వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. మండలంలోని గర్రెపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు జిల్లాస్థాయి టీఎల్ఎం మేళా 2022–23ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులు తయారు చేసి ప్రదర్శించిన బోధన అభ్యాసన సామగ్రిలను కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థులకు కనీస విద్యాప్రమాణాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేయడంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. తొలిమెట్టులో భాగంగా కృత్యమేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించి ప్రదర్శనలు మండలస్థాయి, జిల్లాస్థాయి మేళాను ఉంచినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో జిల్లాస్థాయిలో ఎంపికైన ఎగ్జిబిట్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థిపై శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ సూచించారు.

తొలిమెట్టుతో 60శాతం విద్యార్థులు మెరుగు : డీఈవో

తొలిమెట్టు కార్యక్రమం ద్వారా 12శాతం నుంచి 60శాతం విద్యార్థులు మెరుగుపడ్డారని డీఈవో మాధవి అన్నారు. జిల్లాలో 36 విద్యా కాంప్లెక్స్‌ల పరిధిలో 361 ప్రాథమిక పాఠశాలలు, 84 ప్రాథమికోన్నత పాఠశాలల్లో మొత్తం 16.324 మంది విద్యార్థులకు కనీస విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మొబైల్ సైన్స్, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ తయారు, ఎగ్జిబిట్లు రూపొందించిన ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రశంసాపత్రం ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరగోని సుజాత, ఎంపీటీసీ పులి అనూష, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో శశికళ, పాఠశాల హెచ్‌ఎం మాధవిలత, ఎస్ఎంసీ చైర్మన్ సంపత్, ఆయా మండలాల ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

- బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్
- బసంత్‌నగర్‌లో ఆత్మీయ సమ్మేళనం

పాలకుర్తి: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారికి భరోసా కల్పించారని బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి, టీ ఎస్ఎంఐడీఎస్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జీడీనగర్‌లోని జీఎం. ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మండల బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన శ్రీనివాస్ మాట్లాడుతూ సమైక్య పాలనలో ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల పరిధిలోని తండాల్లో ఆడపిల్లలు పుడితే అమ్ముకునే పరిస్థితి ఉండేదని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్‌తో వారిలో ధైర్యం కల్పించారన్నారు. రైతులను రాజుగా చేయాలనే లక్ష్యంతో రైతుబంధు, ఉచిత విద్యుత్, రైతుబీమా లాంటి పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఎనిమిదేళ్లలో అన్ని రంగాల్లో విశేష అభివృద్ధిని సాధించి దేశంలోని మిగతా రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటువేసి కేసీఆర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తాను పనిచేస్తున్నట్లు తెలిపారు. మెడికల్ కాలేజీ మంజూరుచేశామని, త్వరలోనే ఐటీ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. అంతకుముందు బసంత్‌నగర్ జడ్పీ పాఠశాల నుంచి ఫంక్షన్‌హాల్ వరకు ఎమ్మెల్యే చందర్‌తో పాటు నాయకులు పాదయాత్ర నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు ఇంజపూరి నవీన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు చిలుమల్ల రాకేశ్, పార్టీ ప్రధాన కార్యదర్శి మూల విజయా రెడ్డి, పాలకుర్తి వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, పుట్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రాజయ్య, కన్నాల, మేడిపల్లి సింగిల్‌విండో చైర్మన్‌లు బయ్యపు మనోహర్ రెడ్డి, మామిడాల ప్రభాకర్, పలుగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


ఉమాదేవి (ఫైల్)

జ్యోతినగర్ : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మహిళ మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీపీసీలోని కృష్ణానగర్‌కు చెందిన త్రిదండపాణి ఉమాదేవి (60), భర్త సింగరేణి మాజీ ఉద్యోగి సుగుణాకర్ గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఎన్టీపీసీకి కారులో బయలుదేరారు. రామగుండం ఐటీసీ సమీపంలోని రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో ఉమాదేవి మృతి చెందింది. కాగా కుటుంబ సభ్యులు నేత్రాలను ఐ–బ్యాంక్‌కు దానం చేసేందుకు నిర్ణయించుకున్నారు. రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) ఆర్ఎంవో డాక్టర్ అప్పారావు సహకారంతో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి కే.ఎస్.వాసు, లయన్స్ క్లబ్ ప్రతినిధి త్రివేది ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. అనంతరం హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు ఆమె నేత్రాలను తరలించారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఉమాదేవి మరణించినా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపిందన్నారు. పలువురికి స్ఫూర్తిగా నిలిచిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రవణ్ కుమార్, సి.హెచ్.లింగమూర్తి, ప్రతినిధులు భీష్మాచారి, రాజమౌళి, అన్నపూర్ణ, బంధువులు, కాలనీ పెద్దలు త్రిదండపాణి శ్రీనివాస్, జంగా వెంకటపాపి రెడ్డి, బెల్లంకొండ రాంరెడ్డి, కంది పోశం, రాజిరెడ్డి అభినందించారు.

మహాసభలను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

జ్యోతినగర్: మంచిర్యాల జిల్లాలో ఈనెల 25 నుంచి మూడు రోజులపాటు నిర్వహించే భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి చిలుక శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఎన్టీపీసీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను చర్చించడంతోపాటు భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. 25న మంచిర్యాల జిల్లాలో భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ, 26, 27న రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినిధులతో మహాసభ నిర్వహిస్తారని చెప్పారు. ప్రొఫెసర్ హరగోపాల్, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కె.నారాయణ, సీనియర్ జర్నలిస్ట్ ఎండీ.మునీర్, సామాజిక కార్యకర్త గురజాల రవీందర్రావు, ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అపర్ణ, బి.ప్రదీప్, జాతీయ కార్యదర్శి పోటు ప్రసాద్ తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జి.కుమార్, ఓ.సుధాకర్, కె.మహేందర్, దండు రమేశ్, మొండయ్య, టి.సత్యంరాజు, ఈ.రాజయ్య, గుండ రాజయ్య, తిరుపతి రెడ్డి, పి.మల్లేశ్, శేఖర్, యస్.నారాయణ, లింగయ్య, పి.సంపత్ పాల్గొన్నారు.

పోలీస్ గౌరవాన్ని పెంచేలా పనిచేయాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి


పదోన్నతి పొందిన సిబ్బందిని అభినందిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని(రామగుండం): ప్రజల్లో పోలీస్ శాఖ గౌరవాన్ని పెంపొందించేలా పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. పదోన్నతి పొందిన ఏఆర్ పోలీసులను సీపీ అభినందించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో పదోన్నతితో స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందన్నారు. పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేసిన ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, సమయం దొరికినప్పుడల్లా యోగా, వాకింగ్, రన్నింగ్ చేస్తూ ఉండాలన్నారు. మానసిక, శారీరక ఒత్తిడిని దూరం చేయడానికి శ్రమించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మోహన్, ఏఆర్ ఏసీపీ సుందర్ రావు, ఆర్ఐలు మధుకర్, శ్రీధర్, విష్ణుప్రసాద్, రామగుండం కమిషనరేట్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, ఆర్ఎస్ఐలు రాజేష్, ప్రవీణ్, అనిల్, విశ్వజా పాల్గొన్నారు.

ఆదివాసీలపై అరాచకాలను ఆపాలి

పెద్దపల్లిరూరల్: ఛత్తీస్‌గఢ్‌లోని ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలను ఆపేయాలని పౌరహక్కుల, ప్రజాసంఘాలు, విరసం నేతలు డిమాండ్ చేశారు. పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద శుక్రవారం సీడీఆర్ఓ బహిరంగసభ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలకు మద్దతుగా ఈనెల 26న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు రాజగోపాల్, సుచరిత, వినోద్, రవి, సంజీవ్ కుమార్, వెంకట్, రాజలింగయ్య, సంపత్, బాలసాని రాజయ్య, మల్లేశం, సుదర్శన్, రత్నకుమార్, లింగయ్య తదితరులున్నారు.

బొగ్గుబాయి వార్తలు

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

- ములుగు ఎమ్మెల్యే సీతక్క


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

గోదావరిఖని: సింగరేణి కార్మికుల మద్దతుతో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ములుగు ఎమ్మెల్యే సీతక్క, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. శుక్రవారం జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను, కాంగ్రెస్ ప్రణాళిక, రాహుల్ గాంధీ సందేశాన్ని గడపగడపకూ చేరవేసేందుకు హాథ్ సే హాథ్ జోడోయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధనలో వెన్నంటి ఉంటామన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే సంస్థ ప్రయివేటీకరణపై కీలక నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.అనంతరం హాథ్‌సేహాథ్ జోడో యాత్రలో భాగంగా 7వ డివిజన్ ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కాల్వ లింగస్వామి, రవికుమార్, మారెల్లి రాజిరెడ్డి, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో రాజకీయ జోక్యం అరికట్టాలి

- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్


మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

రామగిరి (మంథని): సింగరేణిలో రాజకీయ జోక్యం మితి మీరుతుందని, దీనిని అరికట్టాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఏపీఏ పరిధిలోని అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ (ఏఎల్పీ)లో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఐఎన్టీయూసీ గుర్తింపు సంఘంగా గెలిపిస్తే సింగరేణి సంస్థ ప్రైవేటు పరం కాకుండా కాపాడుతామన్నారు. సీఎం కేసీఆర్ గత గుర్తింపు ఎన్నికల సమయంలో కొత్త బొగ్గు బావులు తీసుకువచ్చి 20 వేల కొత్త ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు కేవలం పైరవీలకు మాత్రమే పరిమితయ్యాయరని విమర్శించారు. అనంతరం గనిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గని మేనేజర్ తిరుపతి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి, సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహరెడ్డి, ధర్మపురి, సెంట్రల్ క్యాంపెనింగ్ ఇన్‌చార్జి వికాస్, సెంట్రల్ కల్చరల్ ఇన్‌చార్జి చంద్రు మల్లయ్య, ఫిట్ కార్యదర్శులు, బ్రాంచ్ కార్యదర్శులు, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి



యూనియన్‌లో చేరిన కార్మికులతో నాయకులు

- ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పలువురు కార్మికులు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్పత్తికి ఆటంకం పేరుతో యాజమాన్యం కోర్టుకు వెళ్లి వాయిదా కోరడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల్లో ఎవరితో పొత్తు లేకుండా ఏఐటీయూసీ పోటీ చేస్తుందన్నారు. ఈనెల 13న హైదరాబాద్‌లో ఆర్ఎల్‌సీ వద్ద జరిగిన అన్ని యూనియన్ల సమావేశంలో నిర్ణయం ప్రకారం ఏప్రిల్–2న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు రంగు శ్రీనివాస్, ముస్కె సమ్మయ్య, ఆరెల్లి పోషం, మడ్డి ఎల్లాగౌడ్, మాదన మహేశ్, ఎస్. నర్సింగారావు, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా అగ్నిమాపక అధికారి షేక్ ఖాజా కరీముల్లా


రికార్డులు పరిశీలిస్తున్న షేక్ ఖాజా కరీముల్లా

పెద్దపల్లిరూరల్: అగ్నిప్రమాదాల నివారణకు అప్రమత్తతే ముఖ్యమని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి (గోదావరిఖని డివిజన్) షేక్ ఖాజా కరీముల్లా అన్నారు. పెద్దపల్లి అగ్నిమాపక కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో ఉన్న వసతులు, వాహనాల సామర్థ్యం తదితర వివరాలను అగ్నిమాపక శాఖ అధికారి దేవనంది శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో పెద్దపల్లితో పాటు గోదావరిఖని, మంథనిలో అగ్నిమాపక కేంద్రాలున్నాయని, ఆయా కేంద్రాల్లో (ఒక్కో కేంద్రంలో 16మంది చొప్పున) 48 మంది ఉద్యోగ సిబ్బంది పనిచేయాల్సి ఉండగా 27మంది మాత్రమే ఉన్నారని వివరించారు. సిబ్బంది కొరత కారణంగా కొంత ఇబ్బంది కలుగుతోందన్నారు. జిల్లాలో మూడు కేంద్రాల్లో ఉన్న అగ్నిమాపక వాహనాలకు తోడు అత్యవసర సమయాల్లో రామగుండం ఎరువుల కర్మాగారానికి చెందిన మరో రెండు వాహనాలు కూడా సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు.

ప్రమాదాల నియంత్రణపై అవగాహన

అగ్నిప్రమాదాలు సంభవిస్తే మంటలను అదుపు చేసేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై షాపింగ్ మాల్స్, పాఠశాలలు, ప్రధాన కూడళ్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో అవగాహన కల్పిస్తున్నామని జిల్లా అగ్నిమాపక అధికారి కరీముల్లా తెలిపారు. వేసవిలో వరికొయ్యలు, గడ్డివాములు ఎక్కువ కాలిపోయే ప్రమాదముంటుందని, రైతులు ఆయా ప్రాంతాల్లో నిప్పురవ్వలు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నియంత్రించొచ్చన్నారు. పెద్దపల్లిలో ఇటీవల జరిగిన టపాకాయల గోదాం, కార్లు దగ్ధమైన ప్రమాదాల్లో సకాలంలో స్పందించి మంటలను అదుపు చేసిన అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, సిబ్బందిని అభినందించారు.

కాలువలో పడి యువకుడి మృతి


మెట్టు శ్రీకాంత్ (ఫైల్)

పెద్దపల్లి రూరల్: బైక్ అదుపుతప్పి ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన మెట్టు శ్రీకాంత్ (30) మృతిచెందాడు. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి పెద్దకల్వలకు వెళ్తున్నాడు. గ్రామశివారులో మలుపువద్ద బైక్ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి మూడేళ్ల వయసున్న కుమారుడు ఉండగా భార్య దివ్య గర్భిణి. దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సైబర్‌నేరగాళ్లకు చిక్కిన యువతులు

- ఒకరు రూ.10 వేలు..
- మరొకరు రూ.2వేలు మోసపోయిన వైనం

కోనరావుపేట(వేములవాడ): సైబర్ నేరగాళ్లు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. బంధువుల పేరుతో చాటింగ్ చేసి డబ్బుల లాగుతున్నారు. డబ్బులు వారికి చేరడంతోనే ఆ నంబర్ నుంచి మెస్సేజ్ రావడం ఆగిపోతుంది. మోసపోయామని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. కోనరావుపేట మండలానికి చెందిన ఓ యువతికి ఆమె బంధువు పేరిట మెస్సేజ్ వచ్చింది. తన ఖాతా పరిమితి దాటిపోయిందని అర్జంటుగా రూ.10 వేలు పంపమని మెస్సేజ్ పెట్టాడు. దగ్గరి బంధువే కదాని డబ్బులు పంపింది. డబ్బులు పంపిన వెంటనే లైన్ కట్ అయింది. బంధువుకు ఫోన్ చేయగా తాను కాదని చెప్పడంతో మోసపోయినట్లు తెలుసుకున్నారు. మరో మహిళకు కూడా ఇలాగే మెస్సేజ్ రావడంతో ఆమె రూ.2 వేలు పంపింది. వీరు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి మెస్సేజ్‌లు వస్తే ఎవరూ స్పందించవద్దని పోలీసులు కోరుతున్నారు.